క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పర్యటన

గంగవరం : మండల కేంద్రంలో సోమవారం రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పర్యటిస్తున్నట్టు తహసీల్దార్ శ్రీమన్నారాయణ చెప్పారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2.30గంటలకు నిర్వహించనున్న పట్టాలు పంపిణీ, ఉచిత గ్యాస్ కనెక్షన్ అందజేత కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాలకు పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

60 మందికి కంటి పరీక్షలు



చెరకుంపాలెంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాజవొమ్మంగి: మండలంలోని చెరకుంపాలెంలో అంజు కంటి ఆస్పత్రి (కాకినాడ) ఆధ్వర్యంలో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి కంటి సమస్యలతో ఉన్న 60 మంది రోగులు వచ్చారు. వారికి డాక్టర్ తేజ, డాక్టర్ రూహిలు చికిత్స అందజేసినట్టు సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు తెలిపారు. మేనేజర్ స్వామి వందనం, పీఆర్వో నాగేంద్ర, సృజన్, రత్నరాజ్, హేమంత్, పద్మావతి, చంద్ర పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు పంచాయతీ పరిధిలో తోడుబంధ, కికెట్టిగూడ, కురుసేల గ్రామాల్లో ఆదివారం జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.7.50 లక్షలతో బోరు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కళావతి మాట్లాడుతూ గతంలో తాగునీటి సౌకర్యం లేక గ్రామస్తులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందిస్తోందన్నారు. శివారు గ్రామాల్లో సైతం తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. నాయకులు శ్రీరాములు, నొబో, రామ్మూర్తి, వార్డు సభ్యులు జగన్నాథం, నగేష్, రామరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో గణపతి విగ్రహ ప్రతిష్ఠ



పాఠశాల ఆవరణలో విద్యాగణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దాత శ్రీనివాసశర్మ తదితరులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం విద్యాగణపతి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఈ ప్రాంగణంలో గతంలో ఏర్పాటు చేసిన విగ్రహం జీర్ణావస్థకు చేరడంతో పాఠశాల పూర్వ విద్యార్థి కొంపెల్లి శ్రీనివాసశరమ్మ (1992 బ్యాచ్) నూతన విగ్రహాన్ని తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు పూర్వ విద్యార్థులు బద్రి, ప్రసాద్, నాగబాబు, నాగేశ్వరరావు, వీర్రాజు తదితరులున్నారు.

రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

చింతపల్లిరూరల్: మండలంలోని నాగులగొంది,చల్లాయి గ్రామాల్లోని వృద్ధులకు చేయూత వారియర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు దూనబోయన రమణ మాట్లాడుతూ డాక్టర్ గౌతమినాయుడు ఆర్థిక సాయయంతో చలి నుంచి గిరిజనులు రక్షణ కల్పించేందుకు రగ్గులు అందజేశామన్నారు. ట్రస్టు తరఫున గిరిజన గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ట్రస్ట్ సభ్యులు రాజేష్, జగన్, సత్యనారాయణ, శివకుమార్ పాల్గొన్నారు.



ప్రగతి బాటలు

- ఏజెన్సీలో శివారు గ్రామాల రోడ్లకు మహర్దశ
- ఏళ్లనాటి కల సాకారం
- ఆనందంలో గిరిజనం

నాడు.. ఇరుకైన రహదారులు.. అడుగడుగునా గుంతలు.. వానొస్తే బురద.. ఎండొస్తే దుమ్ము.. బండెక్కితే ఉయ్యాల జంపాల.. కిలోమీటర్ దూరానికి పది నిమిషాలకుపైగా సమయం.. దారిపొడవునా కుదుపులతో ఒళ్లంతా హూనం.. ఇది నాటి టీడీపీ పాలనలో ఏజెన్సీలో రోడ్ల దుస్థితి.
నేడు.. విశాలమైన రోడ్లు.. సాఫీగా రాకపోకలు.. కిలోమీటర్ల దూరం కూడా నిమిషాల్లోనే వెళ్లే సౌకర్యం.. అంతరాయం, అలసట లేకుండా ప్రయాణం.. వానొచ్చినా.. వరదొచ్చినా ఆటంకం లేకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరిక..
ఇది నేటి వైఎస్సార్‌సీపీ పాలనలో 'ప్రగతి బాట'లు.



గుమ్మ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు

అనంతగిరి: గతంలోని రహదారులు లేక గిరిజనులు ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.. మౌలిక వసతులు దూరమయ్యారు.. మారుమూల గ్రామాలు అభివృద్ధిలో సైతం వెనుక్కబడ్డారు. గత టీడీపీ ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధిపై కుంటిసాకులు చెప్పి తప్పించుకుంది... నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఓవైపు సంక్షేమం అమలుచేస్తూ.. మరోవైపు అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతుంది.. ఇందుకు నిదర్శనం.. మారుమూల గ్రామాలకు తారురోడ్లే నిర్మాణానికి నిధులు మంజూరు కావడమే..తారురోడ్లు, జీఎస్‌బీరోడ్లు నిర్మాణం పనులు జోరుగా జరుగుతున్నాయి. ఉత్తమ నాణ్యత ప్రమాణాలతో పంచాయతీరాజ్‌శాఖ పర్యవేక్షణలో సాగుతున్నాయి. రోడ్లు నిర్మాణంతో మారుమూల గ్రామాల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంజూరైన తారురోడ్లు

- గుమ్మపంచాయతీ సమరెడ్డిపాలెం నుంచి వంజనివలస వరకు రూ.80లక్షలతో 2 కిలోమీటర్లు రహదారి పనులు
- గుమ్మ నుంచి నిమ్మఊట వరకు రూ.70.7 లక్షలతో 1.6 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం
- అనంతగిరి పంచాయతీ పెద్దూరు నుంచి మాలింగవలస వరకు రూ.39లక్షలతో రోడ్డు పనులు
- గరుగుబిల్లి పంచాయతీ గరుగుబిల్లి నుంచి పైడిపర్తి వరకు 1.5 కిలో మీటరు 61.5లక్షలు మంజూరు
- గుమ్మకోట పంచాయతీ చిప్పపల్లి నుంచి దబ్బలపాడు 1 కిలో మీటరు 38 లక్షలు నిధులు విడుదల
- లంగుపర్తి పంచాయతీ నిమ్మలపాడు రోడ్డు నుంచి రాయిపాడు వరకు రూ.51లక్షలతో 1.2 కిలోమీటరు రహదారి
- టోకూరు పంచాయతీ జాకరవలస నుంచి బోరిబోరివలస 1 కిలోమీటరు 39 లక్షలతో తారు రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరైయి పనులు ప్రారంభమైయ్యాయి. ఆయా గ్రామాలకు తారురోడ్లుకు నిధులు మంజూరు కావడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..



మాలింగవలస తారురోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

మండలం: అనంతగిరి		
పంచాయతీలు	:	24
గ్రామాలు	:	418
జనాభా	:	50వేలు
జీఎస్‌బీ రోడ్లకు	:	రూ.4.62కోట్లు
తారురోడ్లకు	:	రూ.3.79 కోట్లు
50 గ్రామాలకు మేలు జరిగేలా రోడ్ల నిర్మాణం		



నిర్మాణంలో ఉన్న మాలింగవలస తారురోడ్డు



నిర్మాణానికి సిద్ధం చేసిన కరివేసు రోడ్డు

శరవేగంగా అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో ఏజెన్సీలో ఎన్నడూ చూడని అభివృద్ధిని చూస్తున్నాం. గతంలోని మా గ్రామానికి రోడ్లు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులు చుట్టు ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోయింది. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెరుకుబిడ్డ నుంచి కరివేసుకు జీఎస్‌బీ రోడ్లు పనులు పనులు జరుగుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది. – పాడి కృష్ణమూర్తి, కరివేసు గ్రామం

జగనన్నకు రుణపడి ఉంటాం



మాగ్రామానికి తారురోడ్డు మంజూరు కావడం చాల సంతోషంగా ఉంది. రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడేవారిమి... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలోని మాగ్రామానికి మేలు గిరిజనులు అంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.. – గంగరాజు, నిమ్మ ఊట గ్రామం

త్వరితగతిన పనులు

తారురోడ్లు మంజూరైన ఆయా గ్రామాల్లో నాణ్యతప్రమాణాలతో రోడ్డు నిర్మాణం చేపట్టువిధంగా చర్యలు చేపడతాం. త్వరితగతిన పనులు రోడ్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం. –సాయి విజయ్, పీఆర్ ఏఈ అనంతగిరి

హక్కులపై అవగాహన అవసరం



చిన్నారులకు భోజనం తినిపిస్తున్న మానవ హక్కుల నేరనిరోధక సంఘం జిల్లా అధ్యక్షురాలు కృష్ణకుమారి

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ సాయినగర్ గ్రామంలో ఆదివారం ఘనంగా మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. మానవ హక్కుల నేర నిరోధక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు కృష్ణకుమారి మాట్లాడుతూ జాతి, వర్ణ, లింగ, కుల, మత రాజకీయ ఇతర కారణాలతో వివక్ష లేని జీవనం గడపాలి, చిత్రహింసలు, క్రూరత్వం నుంచి బయటపడటం, నిర్బంధం లేని జీవన విధానం ఉండాలన్నారు. హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆదివాసీ గిరిజన చిన్నారులకు భోజనం ఏర్పాటుచేశారు. చిన్నారులకు ఆమె గోరుముద్దలు పెట్టి తినిపించారు. నాయకులు సింహాచలం, పద్మ , దేవిడ్, గాసి, లక్ష్మణరావుతదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు అండగా ప్రభుత్వం



సంగంబందలో రైతులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: అధైర్యం పడొద్దు.. పంట నష్టం జరిగిన ప్రతి రైతుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించి ఆదుకుంటుందని ఎస్టీ కమిషన్ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలో గెమ్మెలి పంచాయతీ సంగంబంద, పొత్తంగిగొంది తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలవుతున్న తీరును ఆయన గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిచాంగ్ తుపాను వల్ల జరిగిన పంట నష్టంపై ఆరా తీశారు. రైతులు ఎటువంటి అపోహాలు, సందేహాలను పెట్టుకోవద్దని నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో నష్ట పరిహారం అందిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

పాడేరు బస్సు సర్వీసు పునఃప్రారంభం



కూనవరంలో పాడేరు బస్సుకు స్వాగతం పలుకుతున్న ప్రజా ప్రతినిధులు నాయకులు

కూనవరం: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు నుంచి విలీన మండలాలకు ప్రారంభించిన ఏపీఎస్‌ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ గుజ్జా విజయ, వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్ అన్నారు. ఇటీవల నూతనంగా ప్రారంభమైన పాడేరు బస్సు సర్వీస్ మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో నిలిపివేశారు. ఎట్టకేలకు ఈ సర్వీసును పునఃప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రం పాడేరు నుంచి బయలుదేరిన బస్సు శనివారం అర్ధరాత్రి 12.00 గంటలకు భద్రాచలం చేరుకుంది. తిరిగి ఆదివారం ఉదయం భద్రాచలం నుంచి 7.30 గంటలకు బయలుదేరి 8.30 గంటలకు కూనవరం చేరింది. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై కొబ్బరికాయలు కొట్టి బస్సుకు స్వాగతం పలికారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌ల ప్రత్యేక చొరవతో బస్సు సర్వీసు అందుబాటులోకి వచ్చిందని వారు చెప్పారు. బస్సు సర్వీసు పాడేరు నుంచి బస్‌రావడం పట్ల విలీన మండలాల్లో హర్షాతిరేకం వ్యక్త మవుతుందన్నారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబులకు, పాడేరు ఆర్‌ఎం, డీఎంలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మేరుకులం రాష్ట్ర డైరెక్టర్ దీకొండ గంగాధర్‌రావు, ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మాని అనంతలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ గుజ్జాబాబు, మండల మహిళా ఉపాధ్యక్షురాలు కొమ్మాని సునీత, సర్పంచ్ కట్టం లక్ష్మి, కొమ్మాని మోహన్‌రావు, ఎంవీవీ రావు, కె.వెంకట్రావ్, వీర్రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోట సత్తెమ్మ తల్లి పండగ



సారె ఊరేగింపులో భక్తులు

నాతవరం: డి.యర్రవరంలో కోట సత్తెమ్మ తల్లి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు ఏటా మాదిరిగానే అమ్మవారికి పసుపు కుంకుమ, రవికె సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇగ్రామానికి సమీపంలో కొండపై అమ్మవారి ఆలయం వద్ద సంహపంక్తి భోజనాలు చేశారు. పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడా కిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

అడ్డతీగల: గ్రామాల్లో ఆసక్తి కలిగిన యువతను క్రీడల్లో ప్రోత్సహించాలని ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. ఈ మేరకు ఎల్లవరంలోని ఆయన స్వగృహంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో అడ్డతీగల మండలం మిట్లపాలెం, మట్లపాడు గ్రామాలకు చెందిన యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను ఎమ్మెల్సీ అనంతబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద గిరిజన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. క్రికెట్, వాలీబాల్ తదితర కిట్‌లను తాను, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కొనుగోలు చేసి క్రీడాకారులకు అందజేస్తున్నామన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

మోదమ్మకు ప్రత్యేక పూజలు



భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేస్తున్న మల్లేష్, ఇతర కుటుంబ సభ్యులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది.
భారీగా తరలివచ్చిన భక్తులు ఆదివారం మోదకొండమ్మను దర్శించుకుని,తమ మొక్కులు తీర్చుకున్నారు. పాడేరుకు చెందిన భక్తుడు గంపరాయి మల్లేష్ భక్తులకు ఉచిత ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహయంతో భక్తులకు మధ్యాహ్నం ఉచిత భోజనాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు,అన్నదాన కమిటీ ప్రతినిధులు వంతెన్న రాజబాబు, ముకుందరావు, శివరాత్రి శ్రీనివాసరావు, కారం దేముడు పాల్గొన్నారు.

నేడు భోగలింగేశ్వరుడికి బిల్వార్చన

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 8 గంటలకు మాసశివరాత్రి పురస్కరించుకుని స్వామివారికి బిల్వార్చన, లక్ష కుంకుమార్చన, గోపూజ, సూర్యనమస్కారాలు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, మృత్యుంజయ రుద్రహోమం, జ్యోతిలింగార్చన, పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తుల కోసం పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. పరిసర గ్రామాల ప్రజలు పూజల్లో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం

కె.కోటపాడు: చౌడువాడలోని గవరపేటలో ఏర్పాటు చేసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవమూర్తుల అనుపు మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గవరపేట రామాలయం నుంచి గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆ సమయంలో మహిళల, చిన్నారుల కోలాటాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఉత్సవమూర్తుల విగ్రహాలను గ్రామ శివారు శారదానదిలో నిమజ్జనం చేశారు.
దేవరాపల్లి: గౌరీ పరమేశ్వరుల యూత్ ఆధ్వర్యంలో దేవరాపల్లిలో గైరమ్మ అనుపు మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఇక్కడ రామాలయం వద్ద నెలకొల్పిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవమూర్తుల వేడుక నెల రోజుల పాటు నిర్వహించారు. చివరి రోజు మహిళల కోలాటం, దేవతామూర్తుల, బండ్ల వేషధారణలు, తీన్మార్ వాయిద్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. అనంతరం సమీప శారదా నదిలో నిమజ్జనం చేశారు. ఉత్సవమూర్తుల విగ్రహాన్ని భాస్కరరావు తలపై పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మృతుడు నూకరాజు కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు తదితరులు

అడ్డతీగల: అనారోగ్య కారణాలతో పెద్ద దిక్కుని కోల్పోయిన కుటుంబానికి రూ.2 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుని ఎమ్మెల్సీ అనంతబాబు ఆదివారం అందజేశారు.అడ్డతీగల మండలం మట్లపాడుకి చెందిన కర్రి నూకరాజు వైఎస్సార్‌సీపీ స్థాపించిన నాటి నుంచి పార్టీ కోసం క్రియాశీలకంగా పనిచేశారు.ఇతను రెండు మాసాల క్రితం అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. భార్య, ఇద్దరు పిల్లలు అతనిపై ఆధారపడి ఉన్నారు. నూకరాజు మృతితో ఆ కుటుంబం దిక్కు తోచని స్థితిలో ఉంది. విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మితో పాటు తను కోరడం జరిగిందని ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు.దీనిపై ముఖ్యమంత్రి స్పందించి సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షలు విడుదల మంజూరు చేశారన్నారు. ఆ చెక్కుని నూకరాజు కుటుంబానికి మట్లపాడు వెళ్లి ఆదివారం అందజేసినట్టు ఎమ్మెల్సీ అనంత బాబు చెప్పారు. సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ నక్కా మోహన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

చింతపల్లిరూరల్: రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కమిటీ కార్యదర్శి గణబాబు అన్నారు.మండలంలో కొమ్మంగి పంచాయతీ లంకపాకల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామంలో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పర్యటించినపుడు స్థానికులు రోడ్డు సమస్యను విన్నవించారని, దీనిపై ఆమె స్పందించి సమస్య పరిష్కరించారన్నారు.ఈ మేరకు రూ.15 లక్షలతో రోడ్డు పనులు చేపడుతున్నట్టు చెప్పారు. రహదారి అందుబాటులో రానుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీటీసీ రూతు, నాయకులు సత్యనారాయణ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

రాజవొమ్మంగి : ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం, ఎంతో సులభం అని, ప్రయాణికులను సకాలంలో గమ్యం చేర్చడంతో మేము ఎప్పుడు ముందు జాగ్రత్తలతో వ్యవహరిస్తున్నామని ఏలేశ్వరం డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వీఎస్‌వీఎస్. నారాయణ అన్నారు. ఆయన ఆదివారం మండలంలోని తంటికొండ గ్రామంలో గిఫ్ట్ స్కీం విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు గిఫ్ట్‌బాక్స్‌లో తమ కూపన్లు వేయాలని, వాటిని డ్రా తీసి విజేతలకు ఈ విధంగా ప్రతి నెల బహుమతులు అందజేస్తు ప్రయాణికులను చైతన్య పరుస్తున్నామన్నారు. ఏడీసీ. ఎం.చిన్నారావు, గ్రామస్తులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధి పంబ పీఠం వద్ద శనివారం రాత్రి అయ్యప్పస్వాముల అంబలం పూజ ఘనంగా జరిగింది. గురుస్వాములు ఒమ్మి రాము, బుదిరెడ్డి మురళీకృష్ణ, పూజస్వామి పెదిరెడ్ల రమేష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలో సుమారు 200 మంది అయ్యప్ప మాలధారులు పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. 18 మెట్లను ఏర్పాటు చేసి, వాటిపై హారతి వెలిగించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తిలు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వాములకు ప్రసాద వితరణ చేశారు. స్వాములు మద్దాల రమణ, ముత్తా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు అంబలం పూజ

సాక్షి,పాడేరు: పవిత్ర కార్తీకమాసం నాలుగో సోమవారం పురస్కరించుకుని మోదకొండమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం నుంచి అయ్యప్పస్వామి అంబలం పూజను నిర్వహిస్తామని గురుస్వామి ఈశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప, భవానీ, శివ మాలధారులు పూజకు రావాలని ఆయన కోరారు.